క్లుప్తంగా

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

డోన్ : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు గొప్ప వరం లాంటిదని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో మంగళవారం పట్టణానికి చెందిన బోగోలు రంగమ్మ అనే మహిళకు మంజూరైన రూ.1.80లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పోస్టుపసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినితో హెచ్‌ఎం బయ్యన్న, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బి.సుదేష్ణ రాష్ట్ర స్థాయి యోగా పోటీకు ఎంపికైనట్లు స్కూల్ హెచ్‌ఎం బయ్యన్న మంగళవారం తెలిపారు. ఈమె నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు వెస్టు గోదావరి జిల్లా వీరసంలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. విద్యార్థిని సుదేష్ణను అభినందించారు. కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందవరం గ్రామ జాతర


బోనాలతో ఆలయం వద్దకు ర్యాలీగా వస్తున్న మహిళలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో గ్రామ జాతరను గ్రామ పెద్దలు, ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి ర్యాలీగా బయలుదేరి చౌడేశ్వరీదేవి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఎన్‌బీసీడబ్ల్యూఏ జిల్లా సెక్రటరీగా చిరంజీవి

ప్యాపిలి: జాతీయ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం (ఎన్‌బీసీడబ్ల్యూఏ) నంద్యాల జిల్లా సెక్రటరీగా ప్యాపిలికి చెందిన చిరంజీవి నియమితులయ్యారు. మంగళవారం ఎన్‌బీసీ డబ్ల్యూఏ జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ నక్కలమిట్ట శ్రీనివాసులు పేరిట చిరంజీవికి లేఖ అందింది.

మార్చురీ గది నిర్మాణానికి నిధుల మంజూరు


స్థల పరిశీలిస్తున్న నగరపంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలో శేషారెడ్డి సీహెచ్‌సీలో మార్చురీ గది నిర్మాణానికి రూ. 2లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. మంగళవారం మార్చురీ గది నిర్మించే స్థలాన్ని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వైద్యురాలు సాగరిక పరిశీలించారు. గది నిర్మాణం పూర్తయితే మండల ప్రజలకు మార్చురీ అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో పట్టణ వాసులు రాఘవేంద్రారెడ్డి, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మంగళి ప్రతాప్, తులశమ్మ దంపతుల రెండో కుమారుడు మంగళి శివ శంకర్ (24) పెళ్లి కాలేదని జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు చెడు అలవాట్లకు బానిసై కూలికి వెళ్లిన డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేసేవాడు. తాగిన మత్తులో ఉదయం లోపల రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందాడు. తల్లి తులశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- పలుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

బనగానపల్లె రూరల్ : ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామ సచివాలయం–1లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని, గ్రామ వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, సర్పంచ్ కె.సుమలత, ఎంపీటీసీ సభ్యురాలు ఎల్లాల లక్ష్మీదేవిలతో కలిసి ప్రారంభించారు. ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. సచివాలయ పరిధిలోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహించి ఉచిత వైద్య పరీక్షలు, మందులను పంపిణీ చేస్తున్నారని, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్లను కూడా చేయిస్తున్నారని చెప్పారు.


ఈసీజీ సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

నాలుగేళ్లలో పలుకూరుకు రూ.52 కోట్లు లబ్ధి

పలుకూరు గ్రామంలో గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా మొత్తం రూ.52 కోట్ల నగదును ప్రజలకు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే గ్రామంలో పాఠశాలల అభివృద్ధికి మన బడి నాడు-నేడు, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి కోసం మరో రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్ఆర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పథకాలను అందించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగాలంటే వచ్చే 2024లో ఆయనను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఎమ్మెల్యే అన్నారు.

ప్రజలకు మేలు జరిగితేనే మాకు ఓటు వేయండి

ప్రజలకు మేలు జరిగి ఉంటేనే మాకు ఓటు వేయండని ధైర్యంగా ముందుకు వచ్చి అడుగుతున్న ఎకైక ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వమే అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి అన్నారు. గ్రామానికి గతంలో ఏ ప్రభుత్వం విడుదల చేయని నిధులు, అభివృద్ధి పథకాలతో పాటు సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైద్య శిబిరంలోని ప్రతి కౌంటర్ వద్దకు వెళ్లి వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. శిబిరంలో వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శివకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండం భాస్కర్‌రెడ్డి, గుండం సురేంద్రారెడ్డి, మండ్ల భూపాల్‌రెడ్డి, కాతా వెంకట సుబ్బారెడ్డి, కె.బాలుడు, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యం

డోన్ టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యం అందించడం జరుగుతోందని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ రాణి ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. శిబిరంలో వైద్య సిబ్బంది బీపీ, షుగర్, రక్త, గుండె, కంటి పరీక్షలు చేసి ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా అందజేసారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామలక్ష్మీ, ఉప సర్పంచ్ వడ్డే చిన్నయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

బేతంచెర్ల : సోమయాజులపల్లె నుంచి డోన్ వరకు నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి (340బీ)లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ కోరారు. మంగళవారం మండలపరిధిలోని హెచ్ కొట్టాల గ్రామం వద్ద జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల వద్ద ధర్నా నిర్వహించారు. రైతులకు నష్టపరిహారం చెల్లించిన తరువాతనే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండు చేశారు. ఈ విషయంపై స్పందించిన పీఆర్ఓ అన్నారావు మాట్లాడుతూ సమస్యను వీలైనంత త్వరగా ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు రాముడు, మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, సోమన్న, బాల స్వామి పాల్గొన్నారు.

లారీ క్లీనర్ కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్ : మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన లారీ క్లీనర్ కురువ ఎల్ల నాగన్న (40) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోన్ లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళవారం కొచ్చెర్వు గ్రామానికి వెళ్లి మృతుదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం కొచ్చెర్వు గ్రామానికి చెందిన లారీ వర్కర్లతో సేకరించిన రూ.30వేల నగదును మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ధన లక్ష్మీనాయక్, శివరంగస్వామి, నారాయణ, ఓబులేసు, రమేష్‌రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాలు హర్షించేలా జగనన్న పాలన

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం-అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యతనిస్తూ, అన్ని వర్గాలు హర్షించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సంజామల మండల పరిధిలోని కమలపూరి, నట్లకొత్తూరు సచివాలయాల పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. అర్హత ఉండి పథకాలు ఏమైనా రావాల్సి ఉందా అని అక్క చెల్లెమ్మలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజాసమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంటి సందర్శించే సమయంలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని గమనించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారిని కొత్త స్తంభం వేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లడుతూ.. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్నామన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం ఉమ్మడి జిల్లా జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలా రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్యప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు తులసిరెడ్డి, సర్వేశ్వర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ దారెడ్డి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

జగనన్నే మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర


పాదయాత్రగా వచ్చిన వారికి నొస్సంలో స్వాగతం పలుకుతున్న దృశ్యం

సంజామల: జగనన్నే మళ్లీ సీఎం కావాలని, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని ప్రొద్దటూరు ఎంపీపీ శేఖర్ యాదవ్ పాదయాత్ర చేపట్టారు. సోమవారం ప్రొద్దటూరు నుంచి మొదలైన పాదయాత్ర మంగళవారం సంజామల మండలం పరిధిలోని నొస్సం గ్రామానికి చేరుకుంది. ఈ మేరకు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్కిరెడ్డి శివరామిరెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. యాత్రకు సంఘీభావం తెలుపుతూ అడుగులో అడుగు వేశారు. అనంతరం ఎంపీపీ శేఖర్ మాట్లడుతూ..జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని,రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యే కావాలని ప్రొద్దటూరు నుంచి బనగానపల్లె మండలంలోని నందవరం చౌడెశ్వరి దేవి ఆలయం వరకు 150 మంది అనుచరులతో పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో జగనన్న సుపరిపాన అందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జీవీ సుబ్బయ్య, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ శంకరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణరెడ్డి, సుబ్బయ్య, వినోద్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమద్దిలేటి స్వామి ఆలయానికి రూ.12.70 కోట్లు మంజూరు

బేతంచెర్ల : మండలపరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మహా ప్రకారం, మహా మండప నిర్మాణానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో మొదటి విడతలో రూ.12.70 కోట్లు మంజూరై, పనుల ప్రారంభానికి అనుమతి ఉత్తర్వులు వచ్చాయి. మహా ప్రకారం, మహా మండప నిర్మాణ పనుల్లో భాగంగా గతంలో ఉన్న రెండు గోపురాలను, చిన్న, చిన్న మండపాలను ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు పర్యవేక్షణంలో మంగళవారం తొలగించారు. గురువారం నుంచి మహా ప్రకారం, మహా మండపం బెస్ మట్టం పనులు చేపడతామని వారు తెలిపారు. రెండో విడతతో ఇదే నిర్మాణాలకు రూ.11.30 కోట్లతో పరిపాలన అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపడం జరగిందన్నారు.


ఆలయంలో పాత గాలిగోపురాన్ని కూల్చివేసిన దృశ్యం

టీటీడీ సహకారంతో ఆలయాల నిర్మాణం


ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: జగనన్న ప్రభుత్వం వచ్చాక తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్ నిధులతో గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. పెద్దవెంతుర్ల ఎస్సీ కాలనీలో శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.10 లక్షలతో నిర్మించిన మారెమ్మ ఆలయాన్ని మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజల్లో భక్తి భావం పెంచేందుకు టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నారన్నారు. హిందూ ధర్మపరిరక్షణకు సమరసత సేవా ఫౌండేషన్ కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మాధవరెడ్డి, జిల్లా ధర్మ ప్రచారకులు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

డోన్ టౌన్ : కారికులకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి, 16వ వార్డు కౌన్సిలర్ సుంకయ్య అన్నారు. ఏఐటీయూసీ 104 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ సర్కిల్‌లో మహిళా సమాఖ్య నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం జెండాను ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, సహాయ కార్యదర్శి గఫూర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేంద్ర తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

బనగానపల్లె రూరల్ : మండలంలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు గొల్ల రామకృష్ణుడు, ధన్‌మోహన్ ఆ పార్టీని వీడి మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని పలుకూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో చెరువుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ చిన్నపుల్లయ్య, గడ్డం బాషాల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని పార్టీలో చేరిన గొల్లరామకృష్ణుడు, ధన్ మోహన్‌లకు వైఎస్సార్‌సీపీ కండవా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిన వారందరికీ తగిన ప్రాధాన్యత ఇస్తామని, రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఎంతో మంది ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పథకాలకు ఆకర్శితులై..

రామకృష్ణుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దీంతో పథకాలకు ఆకర్షితులై గ్రామంలో మరికొందరు టీడీపీ పార్టీ వీడి వైఎస్సార్ సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన చెరువుపల్లె గొల్ల రామకృష్ణుడు, ధన్‌మోహన్

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, రాజాబాబు, సుదర్శన్, నాగమద్దిలేటి, టైలర్‌బాషా, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బనగానపల్లె: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మంగళవారం పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు ఆయన స్వగృహంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. దసరా పండుగను పురస్కరించుకొని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు విజయవంతంగా జరిగాయని, ఇందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహాయ సహకారాలు సంపూర్ణంగా అందించడంతో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గాథంశెట్టి వేణుగోపాల్, డాక్టర్ రవికుమార్, నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయకుమార్, శ్రీరామ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుకూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

బనగానపల్లె : మండలంలోని పలుకూరు గ్రామ పంచాయతీలోని సచివాలయం-3లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య మంగళవారం తెలిపారు. వైద్య శిబిరంలో వైద్యులు బి లక్ష్మీ, సోహెల్ బాబు, మౌనికలతో పాటు పలువురు సీనియర్ వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సచివాలయం పరిధిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

ఎనిమిది మందిపై బైండోవర్ కేసులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఎనిమిది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కల్పన తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పెద్దకొప్పెర్ల, రేవనూరు గ్రామానికి చెందిన పాత రౌడీషీటర్లు, శాంతి భద్రతలకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించిన వ్యక్తులపై ముందస్తు చర్యగా బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ పుష్పకుమారి ఎదుట హాజరు పరిచినట్లు వెల్లడించారు.

విజేతలకు అభినందనలు

డోన్ టౌన్: గత నెల 29న గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన ఎనిమిదవ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచిన డోన్ విద్యార్థులకు మంగళవారం ఓ ప్రైవేట్ స్కూల్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులు తరుణ్, వర్షిత్‌రెడ్డి, అభిరాం, కరాటే మాస్టర్ రమణను పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రూ.320కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం ద్వారా పనులు చేపట్టినట్లు మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. డోన్ మునిసిపల్ సర్వసభ్య సమావేశం మంగళవారం కమిషనర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డులలో మౌలిక వసతులు కల్పించే 12 అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం ఫిబ్రవరి నాటికి పూర్తయి పట్టణ ప్రజ ల దాహార్తి శాశ్వతంగా తీరనుండటంతో సీఎం, మంత్రికి సభ ఏకగ్రీవంగా కృతజ్ఞతలు తెలియజేసింది. అలాగే 100 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణం పనులు పూర్తికావడం, అర్బన్ హెల్త్ సెంటర్లను మంత్రి ఇటీవల ప్రారంభించారని చైర్మన్ తెలిపారు. త్వరలోనే ప్రభుత్వాసుపత్రి సమీపంలో 10 ఎకరాల విస్తీర్ణంలో నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు కూడా చేపడతామని చెప్పారు. ఇప్పటికే రుద్రాక్షగుట్ట సమీపంలో ఎస్సీ, బీసీ బాల, బాలికల వసతిగృహాలతో పాటు కళాశాల భవన నిర్మాణాలు కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఎడ్యుకేషనల్ హబ్‌గా డోన్‌ను తీర్చిదిద్దేందుకు మంత్రి బుగ్గన చేస్తున్న కృషిని చైర్మన్‌తో పాటు వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్‌లు కొనియాడారు. ప్రభుత్వ ఐటీఐలో 300 మంది విద్యార్థులకు సరిపడే వసతిగృహ నిర్మాణం కూడా పూర్తికావచ్చిందని చెప్పారు. కోఆప్షన్ సభ్యులు పాత పేట రఫి, కుమ్మరి రాజు, కౌన్సిలర్లు, డీఈ రసూల్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

పోలీసుల సేవలు ఎనలేనివి

డోన్ టౌన్: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎందరో పోలీసులు అశువులుబాసి అమరవీరులయ్యారని, వారి సేవలు చిరస్మరణీయమని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడుటలో పోలీసులు ముందుంటారని తెలిపారు. విధి నిర్వాహణలో దుండగుల చేతిలో తూటాలకు బలైన వారిని స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐలు ప్రవీణ్ కుమార్, ప్రియతంరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సమైక్య స్ఫూర్తి ప్రదాత వల్లభాయ్ పటేల్

బేతంచెర్ల: సమైక్య స్ఫూర్తి ప్రదాత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సామాజికి కార్యకర్త మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మద్దిలేటిరెడ్డి ఆధ్వర్యంలో, పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మధుశేఖర్, పాఠకులు సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫర్హత్ జహాన్, నసీం, మారుతి దేవి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : స్థానిక పాతపేట హైస్కూల్లో హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు.


డోన్ పాతపేట హైస్కూల్‌లో సమైక్య ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బనగానపల్లె : జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సాలహీ బేగం పటేల్ సేవలను కొనియాడారు.

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి , ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజయ్య ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పటేల్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం